పట్టుగూళ్ల మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు

శిడ్లఘట్ట, జూన్ 18: ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఏడు రోజుల శిబిరంలో భాగంగా మంగళవారం శిడ్లఘట్టకు వచ్చారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర కళాశాలలకు చెందిన 150మందికిపైగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శిడ్లఘట్టలోని పట్టుగూళ్ల మార్కెట్‌ను సందర్శించారు. స్థానిక ఆదర్శరైతు హిత్తలహళ్లి గోపాలగౌడకు చెందిన పట్టుగూళ్ల పెంపకం కేంద్రం, చంద్రికల షెడ్, మల్బరీఆకు తోట, వివిధరకాల పంటలను పండిస్తున్న తోటను సందర్శించారు. మార్కెట్ సహాయక డైరెక్టర్ తిమ్మరాజు పట్టుగూళ్ల లావాదేవీలు, ఇ-వేలం, రీలర్లు బిట్‌లుగా మార్చడం అయ్యే ప్రక్రియను వివరించారు.

బ్యాడగికి భలే డిమాండ్..!


మార్కెట్‌కు వచ్చిన బ్యాడగి రకం మిరప

- అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్
- ఆసియా ఖండంలో అతిపెద్ద మిరప మార్కెట్ బ్యాడగి
- రూ.3,187 కోట్ల లావాదేవీలతో ఈ ఏడాది రికార్డు
- 70 ఏళ్లుగా రికార్డు స్థాయిలో వ్యాపారాలు

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఘాటుతోపాటు ఘుమఘుమలాడే ఎండు మిర్చి అన్నదాతలకు కోట్లు కురిపించింది. దక్షిణాదిన ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకానికి ప్రాధాన్యత ఉంది. జాతీయస్థాయిలో గుంటూరు మిరపకు మంచి పేరున్న విషయం తెలిసిందే. గుంటూరు మిరప భగభగ మనిపించే కారం కలిగి ఉంటుంది. బ్యాడగి రకం రంగుతోపాటు రుచి ప్రత్యేకతగా ఉంది. బ్యాడగి అంటే మిరపకాయ వంగడమా లేదా ఒక ఊరా అనేది కూడా ఆసక్తికరమే. రాష్ట్రంలోని హావేరి జిల్లాలో బ్యాడగి అనే పట్టణం ఉంది. 'బ్యాడగి' రకం మిరప మార్కెట్‌కు దశాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ ప్రాంతాలకు ఈ మిరప ఎగుమతి అవుతుంది. ఈ ఏడాది రూ.3,187 కోట్ల లావాదేవీలతో రికార్డు నెలకొంది. బ్యాడగిలో 1952లో మిరప మార్కెట్ ప్రారంభమయింది. అప్పట్లో కోటి రూపాయల దాకా వ్యాపారాలు సాగేవి. ప్రస్తుతం రూ.3వేల కోట్ల దాకా లావాదేవీల చేరాయంటే మార్కెట్ ప్రగతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద వ్యాపారకేంద్రంగా బ్యాడగి నిలిచింది. గత ఏడాది రూ.2,287 కోట్ల లావాదేవీలు సాగగా అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)కి రూ. 13.72 కోట్ల పన్ను లభించింది. 2023-24లో రూ.3,187 కోట్ల లావాదేవీలు సాగగా రూ.19.12 కోట్లు సెస్సు సాధ్యమైంది. గత ఏడాదితో పోలిస్తే లావాదేవీలు పెరుగుతూ వచ్చాయి. పదేళ్లలో ఏపీఎంసీ మార్కెట్‌కు సుమారు రూ. 140 కోట్ల పన్ను వసూలైంది. పదేళ్ల క్రితం మార్కెట్‌తో పోలిస్తే రెట్టింపు లావాదేవీలు సాగుతున్నాయి. బళ్లారి, రాయచూరు, అంతూరు-బెంతూరు, గదగ్, చిత్రదుర్గతోపాటు పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావం కారణంగా మిరప దిగుబడి తగ్గింది. కానీ గత ఏడాది క్వింటాలుకు రూ.40-50వేల ధర పలకడంతో రైతులు సాగునీటి వనరుల ద్వారా బ్యాడగి మిరప సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు ఇలా ఈ ఏడాది ఏపీఎంసీ మార్కెట్‌కు భారీగా మిరప వచ్చింది.



అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు



దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ బ్యాడగి కడ్డి, డబ్బి వంగడం, గుంటూరు మిరపకు డిమాండ్ ఉంది. బ్యాడగికి చెందిన ఎండు మిరప ఆహార పదార్థాల్లో ఉపయోగించేందుకు అన్ని దేశాలవారు ఆసక్తి చూపుతారు. కూరలు, డ్రై ఆహార పదార్థాలకు రంగు, రుచి రెండింటి కోసం బ్యాడగి మిర్చిని వాడతారు. అందుకే వివిధ దేశాలకు ఎగుమతి అవుతుంది. ప్రసిద్ధమైన చాలా మసాలా కంపెనీలతోపాటు దాదాపు మసాల, సాంబారు పొడుల కంపెనీలు ప్రతిరోజూ భారీగా మిరపను కొనుగోలు చేస్తాయి. ఇదే ప్రాంతంలోనే పలు కంపెనీలు మిరపను నిల్వ చేస్తుంటాయి. ఇలా బ్యాడగి ప్రాంతంలో 32కు పైగా కోల్డ్‌స్టోరేజ్‌లు ఉన్నాయి. ఒక్కో కోల్డ్ స్టోరేజ్‌లో లక్ష నుంచి మూడు లక్షల మిరపసంచులు నిల్వ ఉంచేందుకు వీలు ఉంది. రైతులు, వ్యాపారులు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచి ప్రతివారం విక్రయాలు సాగిస్తుంటారు.


మార్కెట్లో అమ్మకానికి వచ్చిన మిరపకాయలు

పదేళ్లలో రూ.140 కోట్ల పన్ను : కార్యదర్శి

పదేళ్లలో రూ.140 కోట్లు పన్ను రూపంలో ఏపీఎంసీ మార్కెట్‌కు దక్కిందని, బ్యాడగి మార్కెట్‌కు మిరప దిగుమతి కావడం ఏటా పెరుగుతోందని, పదేళ్లలో గణనీయమైన ప్రగతి సాధ్యమవుతోందని ఏపీఎంసీ కార్యదర్శి హెచ్‌వై సతీశ్ తెలిపారు. రైతులు నాణ్యమైన మిరపను మార్కెట్‌కు తీసుకొస్తే తగిన ధర సాధ్యమవుతోందన్నారు. వ్యాపారులు సకాలంలో డబ్బులు చెల్లిస్తారని, అందుకు తగినట్టుగానే రైతులకు జమ చేస్తామని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో రాజీ లేదన్నారు. ఈ ఏడాది రూ.3వేల కోట్ల టర్నోవర్ కావడం మార్కెట్ రికార్డుగా ఉందన్నారు. రైతులు, వ్యాపారుల సహకారం మార్కెట్‌కు ముఖ్యమన్నారు.

ఏడాది	క్వింటాళ్లు	పన్నులు (రూ.కోట్లలో)
2015-16	8,61,916	9.31
2016-17	9,80,960	12.90
2017-18	11,93,053	15.60
2018-19	10,41,073	13.79
2019.20	13,95,931	15.41
2020-21	8,42,230	18.92
2021-22	11,22,802	12.07
2022-23	9,90,002	13.72
2023-24	17,00,090	19.12

జూలై 12న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- శెట్టర్ రాజీనామాతో ఒక్కస్థానం ఖాళీ
- శాసనసభ్యుల కోటాలో ఎన్నిక



బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో విధానపరిషత్ సభ్యుడిగా ఎన్నికైన జగదీశ్ శెట్టర్ రాజీనామాతో ఖాళీ అయిన ఒక స్థానానికి జూలై 12న ఎన్నికల నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ జారీ చేసింది. ఈనెల 25న నోటిఫికేషన్ జారీ కానుండగా అదే రోజు నుంచే నామినేషన్ల స్వీకరిస్తారు. జూలై 2వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉండగా 3న పరిశీలనలకు, 5వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా పోలింగ్ కొనసాగనుంది. ఆదేరోజున సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. జగదీశ్ శెట్టర్‌కు 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యేల కోటాలో విధానపరిషత్‌కు ఎన్నికయ్యారు. 2028 జూన్ 14దాకా ఆయన పదవీకాలం ఉంది. ఈ ఏడాది జనవరి 25న శెట్టర్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అయ్యారు. శెట్టర్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. కాగా ఈ స్థానానికి బసనగౌడ బాదర్లికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఖరారు చేసింది. ఎమ్మెల్యేల కోటా ప్రకారం బసనగౌడ బాదర్లి సునాయాసంగానే గెలుపొందనున్నారు.

రెసిడెన్షియల్ స్కూళ్లపై నిర్లక్ష్యం వద్దు

- అధికారులపై సీఎం సిద్దరామయ్య ఆగ్రహం



బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెసిడెన్షియల్ స్కూళ్ల పట్ల నిర్లక్ష్యం చేయరాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. మంత్రి మహదేవప్పతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రెసిడెన్షియల్ స్కూళ్లలో రాత్రి వేళల్లోనూ పరిశీలనలు చేయాలని అధికారులను ఆదేశించారు. బడ్జెట్‌లో రూ.1884.01 కోట్లు కేటాయించగా రూ. 1879.35 కోట్లు ఖర్చు అయ్యిందని, 99.75 శాతం ఖర్చు చేయడంపై అభినందించారు. విద్యార్థులకు సౌలభ్యాలు పెంచే విషయంలో నిరంతరం పరిశీలించాలన్నారు. మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ నుంచి ఆర్థికశాఖ ద్వారా రూ.263కోట్లు ఖజానాకు జమ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. యువజనులు, క్రీడలశాఖ ప్రగతి పరిశీలించారు. కువైట్‌లో అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కలబురగి జిల్లా అళంద తాలూకా సరసంబ గ్రామానికి చెందిన 40ఏళ్ల విజయ్‌కుమార్ కుటుంబానికి రూ.5లక్షల పరిహారాన్ని ప్రకటించారు.

తాలూకా కేంద్రాల్లో కెంపేగౌడ జయంతి


మీడియాతో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాడప్రభు కెంపేగౌడ జయంతిని అన్ని తాలూకా కేంద్రాల్లో అమలు చేయాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. కెంపేగౌడ జయంతి నిర్వహణపై విధానసౌధలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. శాసనసభ నియోజకవర్గం లేదా తాలూకా కేంద్రాల పరిధిలో కెంపేగౌడ జయంతి నిర్వహించేందుకు రూ.లక్ష మంజూరు చేస్తామన్నారు. కెంపేగౌడకు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.20వేలు ఖర్చు చేయాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలోనూ జయంతి నిర్వహించాలని తెలిపారు. కెంపేగౌడ 515వ జయంతి ఈనెల 27న బెంగళూరులో ఆడంబరంగా నిర్వహిస్తామన్నారు. హులియూరు దుర్గ, మాగడి, ఆవతితోపాటు బెంగళూరులో నాలుగువైపులా ఉండే గోపురాలనుంచి జ్యోతుల ఊరేగింపు ఉంటుందన్నారు. బీఎల్ శంకర్ నేతృత్వంలో కెంపేగౌడ పురస్కారాలకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కన్నడ సంస్కృతిశాఖ, బీడీఏ, బీబీఎంపీ నుంచి పురస్కారం ఇస్తామని తెలిపారు. వార్డుస్థాయిలో లేదా నగరస్థాయిలో అవార్డుపై నిర్ణయిస్తామని పేర్కొన్నారు. కెంపేగౌడ మూలసమాధి కోటను అభివృద్ధి చేసేందుకు రూ.కోటి కేటాయించామని వెల్లడించారు. కెంపేగౌడ ప్రాధికార కార్యాలయాన్ని సుమనహళ్లిలో ఏర్పాటుకు 5 ఎకరాలు కేటాయించామని, జయంతి రోజునే భూమిపూజ చేస్తామని అన్నారు. కెంపేగౌడను ఒక కులానికి మాత్రమే పరిమితం చేయరాదని, కులమతాలకు అతీతంగా నిర్వహించాలన్నారు. బెంగళూరు వాతావరణం విద్యతోపాటు ఇతరత్రా సౌలభ్యాలు బాగున్నందునే దేశ, విదేశీ పర్యాటకులు నగరాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతారని తెలిపారు. బెంగళూరులో మరిన్ని సౌలభ్యాలు కల్పిస్తామన్నారు. విమానాశ్రయంలో కెంపేగౌడ విగ్రహాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, సమీప ప్రాంతాల్లో మరింత అభివృద్ధి చేయాల్సి ఉండేదన్నారు. వీటిని మంత్రులు మునియప్ప, కృష్ణబైరేగౌడ పర్యవేక్షిస్తారని తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యాలయానికి సాహితీవేత్తలు వస్తే తప్పేమి ఉందని, తానే స్వయంగా ఆహ్వానించానని వివరించారు. అకాడమీ అధ్యక్షుల సభ తానే నిర్వహించానని అన్నారు. ఇది ప్రభుత్వ నియామకమని, ఎక్కడైనా కూర్చోవచ్చునని, సభలు జరుపుకోవచ్చు అన్నారు. ప్రాధికారలు స్వయం ప్రతిపత్తి సంస్థలు కాదని, అందరూ నాయకులే అన్నారు. ఎవరి సిద్ధాంతాలు వారికి ఉంటాయని, మీడియాకు తప్పు అనిపించవచ్చు అన్నారు. మీడియా సలహాదారులుగా పాత్రికేయులనే నియమిస్తారు కదా..? అని ప్రశ్నించారు.

వాటర్‌ట్యాక్స్ పెంచాల్సి వస్తోంది

బెంగళూరు నగర పరిధిలో వాటర్‌ట్యాక్స్ పెంచాల్సి వస్తోందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. 14 ఏళ్లుగా నీటి పన్నులు పెరగలేదన్నారు. విద్యుత్ చార్జీలు కట్టేందుకు కూడా సాధ్యం కావడం లేదని, సిబ్బంది వేతనాలకు కష్టంగా ఉందని వివరించారు. ఏటా జలమండలికి నష్టాలు వెంటాడుతున్నాయన్నారు. బెంగళూరుకు తాగునీరు అవసరమని తెలిపారు. ధర పెంచాలా వద్దా అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచారని, తాము తగ్గించామని అన్నారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ రెట్టింపు అయ్యిందని, రూ.75 ఉన్న పెట్రోల్ లీటరుకు రూ.100కు చేరిందన్నారు. 3 రూపాయలు పెంచితే గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు.

ఈవీఎంల వల్లే జేడీఎస్, బీజేపీకి ఎక్కువ స్థానాలు

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఈవీఎంల కారణంగానే జేడీఎస్, బీజేపీలకు ఆశించినంతకంటే ఎక్కువ లోక్‌సభ స్థానాలు వచ్చాయని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీబీఎంపీ కార్యాలయంలో గ్యారెంటీల అమలు కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బీబీఎంపీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ ద్వారా ఓటింగ్ రావాలని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసినందున ఏమి చేయడం సాధ్యం కాదన్నారు. మరోసారి ఫలితాలను పరిశీలించవచ్చు అన్నారు. మధ్యప్రదేశ్‌లో బ్యాలెట్ ఓటింగ్ ఉన్నప్పుడు మూడింట రెండొంతులు కాంగ్రెస్‌కు వచ్చేవని, ఈవీఎంల కారణంగా పరిస్థితుల్లో మార్పు వచ్చిందని అన్నారు. వీటిపై సమగ్ర పరిశోధన జరపాల్సి ఉందన్నారు. బీబీఎంపీ ఆస్తులను తాకట్టుపెట్టే విషయమై మీడియా ప్రశ్నకు సమాధానంగా బీబీఎంపీ ఆస్తుల రక్షణ సమీక్ష జరుపుతామన్నారు. కాంట్రాక్టుకు ఇచ్చిన అనుమతులను రెన్యూవల్ చేస్తామన్నారు. బీబీఎంపీలో ప్రకటనల నిబంధనలు వారం రోజుల్లో తీసుకొస్తామన్నారు. మెట్రో పిల్లర్లు, భారీ హోర్డింగ్‌ల వద్ద ప్రకటనలతో ఇబ్బంది ఏర్పడితే తొలగిస్తామన్నారు. అంచెలంచెలుగా ఫ్లెక్సీలను నిషేధిస్తామన్నారు. భారీ హోర్డింగ్‌లతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. లండన్ తరహాలో ఎన్నికలు జరిపే అంశం ప్రస్తావనలో లేదన్నారు. నటుడు దర్శన్ నివాసం రాజకాలువపై ఉందనే అంశాన్ని మీడియా ప్రశ్నించగా దర్శన్‌తోపాటు ఎవరు ఆక్రమణలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. బెంగళూరు పరిసర ప్రాంతాలలో 20వేల ఎకరాల భూమి విక్రయానికి సిద్ధంగా ఉందనే అంశం అవాస్తవమన్నారు. కర్ణాటక ప్రభుత్వం నీట్ పరీక్షలకు వ్యతిరేకమని, అన్యాయానికి గురైన 1563 మంది విద్యార్థులకు మాత్రమే పరీక్షలు జరపకుండా దేశవ్యాప్తంగా మళ్లీ పరీక్షలు జరపాలని డిమాండ్ చేశారు.


బీబీఎంపీ కార్యాలయంలో గ్యారెంటీల అమలు విభాగాన్ని ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్



జేడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్సీలు, కార్యకర్తలు


కన్నడిగర విజయసేన నేతృత్వంలో నిరసన చేపట్టిన నాయకులు


ఆప్ నేతృత్వంలో నిరసన ఇలా..

పెట్రో ధరల పెంపుపై జేడీఎస్, ఆప్ నిరసన

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ జేడీఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, కన్నడిగర విజయసేన వేర్వేరుగా నిరసనలు తెలిపాయి. ఫ్రీడంపార్కులో మంగళవారం జేడీఎస్ నగర అధ్యక్షుడు రమేశ్‌గౌడ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఎమ్మెల్సీలు శరవణ, తిప్పేస్వామి, జవరేగౌడ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శరవణ మాట్లాడుతూ ప్రజలపై పెనుభారం మోపేలా ప్రభుత్వం తీసుకుందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించేదాకా పోరాటం చేస్తామని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. కన్నడిగర విజయసేన సంస్థాపక అధ్యక్షుడు విజయకుమార్, పుట్టసిద్దేగౌడ, మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన సాగింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.81	1,580.31
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	801	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1752	2434
సామర్థ్యం (టీఎంసీలు)	5.98	4.62

నాటు కోళ్లకు ఫుల్ డిమాండ్

● ఆంధ్రా క్యాంపుల్లో జోరుగా అమ్మకాలు



ఫారంలో పెరుగుతున్న నాటు కోళ్లు

బళ్లారి సిటీ,జూన్ 18: వర్షాకాలం మొదలవడంతో నాటుకోడి మాంసానికి డిమాండ్ పెరిగింది. ఈ చలిలో వృద్ధులు ఆరోగ్యం కోసం మందులతో పాటు నాటుకోడి మాంసాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో నాటు కోళ్ల వ్యాపారం జోరందుకుంది. వాతావరణం మేఘావృతమై ఉండడంతో పాటు వృద్ధులు, అస్తమా వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్యం కోసం నాటు కోళ్లను కొనుగోలు చేయడంతో నాటు కోళ్ల రైతులు మరింత లాభపడుతున్నారు. నగర, పట్టణ వాసులు దొడ్డరాజ క్యాంపు, రామచంద్రపుర క్యాంపు, మారుతీ క్యాంపు, కొండయ్య క్యాంపు, ఆంధ్రప్రదేశ్ నుండి వలస వచ్చిన ఎమ్మిగనూరు, చుట్టు ప్రక్కల ఉన్న ఇతర చిన్న గ్రామాలకు వెళ్లి కోళ్లకు వారం ముందుగానే అడ్వాన్స్ డబ్బు చెల్లిస్తున్నారు. బళ్లారి, కురుగోడు, కంప్లీనగర్, ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల్లోని క్యాంపుల నుంచి కిలో నాటుకోడి మాంసాన్ని రూ.500కు కొనుగోలు చేస్తున్నారు.

ఎస్‌యూసీఐ నిరసన



పెట్రో ధరల పెంపుపై నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ

బళ్లారి సిటీ, జూన్ 18: పెట్రోల్, డీజిల్‌పై ధరల పెంపకాన్ని వ్యతిరేకిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తాలూకా కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దేవదాస్ మాట్లాడుతూ, ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సెస్ పెంచడాన్ని ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం రోజుకో రాద్ధాంతం చేస్తున్నదని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే ప్రజలపై పన్నుల భారం మోపుతోందన్నారు. ఒకవైపు ఇవ్వడం, మరొక వైపు దొంగిలించే విధానానికి వ్యతిరేకంగా ప్రజలు తమ స్వరం పెంచాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు డా.ప్రమోద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మంజుల, శాంత, గోవింద్, సభ్యులు నాగరత్న, పంపాపతి, ఈశ్వరీ, రాజా, రవికిరణ్ పాల్గొన్నారు.

కళాకారులు.. రంగస్థల శిల్పులు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్

బళ్లారి సిటీ, జూన్ 18: కళాకారులు స్థిరమైన రంగస్థల శిల్పులని రంగస్థల దర్శకుడు జగదీశ్ అభిప్రాయపడ్డారు. సోమవారం సాయంకాలం నగరంలోని కన్నడ భవనంలో శ్రీజయ కల్చరల్ ఆర్ట్స్ ట్రస్ట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పిల్లలు పెద్ద కలలు కనేలా కథలు చెప్పాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వరలక్ష్మి మాట్లాడుతూ కళలకు సేవ చేసే అవకాశం అందరికీ లభించదన్నారు. కన్నడ, తెలుగు నాటకాలకు వేషధారణలు రూపొందిస్తూ నాటకరంగంలో ఆధునిక రంగస్థల ప్రసాదాన్ని అలవర్చుకున్న ఆనాటి ఏకైక వ్యక్తి డా.శ్రీరాములు అన్నారు. అనంతరం సూర్యకళా ట్రస్ట్ కళాకారులు క్షీర విందేశ్వరీ, శ్రేయ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా సంకన్న, విజయలక్ష్మి, విష్ణు హడపాడు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ ఎన్నికలో ఉద్విగ్నత

● బళ్లారికి చేరుకున్న కాంగ్రెస్ ద్విసభ్య కమిటీ



● మేయర్ పదవి కోసం ముండ్లూరు, ముల్లంగి కుటుంబాల పోటీ
● అల్లం భవనంలో కార్పొరేటర్లతో ద్విసభ్యకమిటీ ప్రత్యేక సమావేశం
● గ్రూపురాజకీయాలను అవకాశంగా మార్చుకునేందుకు బీజేపీ యత్నం

బళ్లారి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. పదవి కోసం కమ్మసామాజిక వర్గానికి చెందిన ముండ్లూరు. ముల్లంగి కుటుంబాలు పోటీ పడుతుండడం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. వరసకు బావ, బావమరిది అయిన ముల్లంగి నందీష్ బాబు, ముండ్లూరు ప్రభంజన్ ఇద్దరూ పదవి కోసం ఉడుంపట్టు పట్టారని తెలుస్తోంది. ఈనేపథ్యంలో మేయర్ అభ్యర్థిని ఖరారు చేయడానికి కాంగ్రెస్ పార్టీ రాజధాని నుండి ద్విసభ్య కమిటీని బళ్లారికి పంపింది. ఈ కమిటీ సభ్యులు బుధవారం కాంగ్రెస్ కార్పొరేటర్లతో సమావేశమై అందరి అభిప్రాయాలను తీసుకోనున్నారు. ఈ సమావేశానికి ఎంపీ నాసీర్‌హుసేన్, ఎమ్మెల్యేలు భరతరెడ్డి, బి. నాగేంద్ర, డీసీసీ అధ్యక్షుడు అల్లంప్రశాంత్ హాజరుకానున్నారని తెలుస్తోంది.

బళ్లారి మేయర్, ఉపమేయర్ పదవికి జూన్ 21న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈ సీటు జనరల్ క్యాటగిరీకి రిజర్వు కావడంతో ఆశావహులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. పాలికె పరిధిలో 39 కార్పొరేట్ స్థానాలుండగా, ఇందులో 13 స్థానాలు బీజేపీ, మిగిలిన 26 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బళ్లారి మేయర్ స్థానానికి ఎన్నిక జరిపారు. ప్రస్తుత ఏడాది మేయర్ పదవి జనరల్‌కు రిజర్వు అయింది. మేయర్ పదవికి కమ్మసామాజిక వర్గానికి చెందిన ముల్లంగి రవింద్రకుమారుడు నందీష్‌బాబు, చిట్టీ కుమారుడు ప్రభంజన్ కుమార్ ఇద్దరూ పోటీపడుతున్నారు. ఇందుకోసం వారి నేపథ్యాన్ని పరిశీలించాల్సి ఉంది. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలో ఉంది. గాలి సోమశేఖర్ రెడ్డి కుమారుడిపై పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు, అలాంటి సమయంలో కాంగ్రెస్ నాయకులు కేసీ కొండయ్య, జేఎస్ ఆంజనేయులు, ఎంపీ నాసీర్ హుసేన్, అప్పటి డీసీసీ అధ్యక్షుడు రఫీక్ ముల్లంగి రవింద్ర ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి కుమారుడు పై ఆయన కుమారుడు నందీష్‌బాబును పోటీకి నిలపాలని కోరారు. ఎన్నికలో గెలిస్తే మేయర్ పదవి ఇస్తామని హమీఇచ్చారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం మేయర్ పదవి ఇవ్వాలని ముల్లంగి రవీంద్ర కోరుతున్నారు.

ముండ్లూరు ప్రభంజన్ కుమార్ విషయానికి వస్తే ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేయడానికి బి-ఫారం ఇవ్వలేదు. అయినా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. డిప్యూటీ సీఎం డి.కే శివకుమార్ కూడా గతంలో ఆయనకు పదవి విషయంలో హమీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము పార్టీ కోసం కష్టపడ్డామని అధిష్టాన వర్గానికి వివరించినట్లు తెలుస్తోంది. మిగిలిన కార్పొరేటర్లు గాదెప్ప, పేరం విక్కీ, ఇతరులు కూడా జనరల్‌కు వచ్చింది కదా తమకూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరి కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో? అందరూ ఉత్కంఠగా చూస్తున్నారు. మరి బీజేపీ వేసే రాజకీయ ఎత్తుగడ ఏంటి..? అనే విషయమై కూడా రాజకీయ చర్చసాగుతోంది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆనెగొందిలో పూజలందుకుంటున్న దుర్గాదేవి

కంప్లి, జూన్ 18: అనెగొంది దుర్గాదేవి, ఉలిగి ఉలిగమ్మదేవికి మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంధ్ర, తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో భక్తాదులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా భక్తాదులు పూలు, పండ్లతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటున్నారు. పుష్పాలతో ప్రత్యేకాలంకరణ, జలాభిషేకం, అమృతాభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాల్లో భక్తాదులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

గ్రామంలోకి ఎలుగుబంటి..

కంప్లి, జూన్ 18 : తాలుకా పరిధిలోని దేవసముద్రం గ్రామంలోకి అడవిలో నుంచి మంగళవారం ఎలుగుబంటి చొరబడింది. గ్రామస్తులు కట్టపై కూర్చునివుండగా పొలాల్లో నుంచి పరిగెత్తుకుంటూ గ్రామ నడిబొడ్డుపై నుంచి వెళ్లడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. రెండు రోజులక్రితమే అంజనాపురం హైస్కూలు వద్ద కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు బోన్లు ఏర్పాటు చేసి వాటిని బంధించి తమకు విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై భగ్గుమన్న బీజేపీ

● సిద్దరామయ్య, డీకే శివకుమార్ చిత్రపటాలతో నిరసన ర్యాలీ
● రాయల్ సర్కిల్లో ద్విచక్రవాహనం దహనం

బళ్లారి సిటీ, రూరల్, జూన్ 18: పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై బీజేపీ భగ్గుమంది. బళ్లారిలో మంగళవారం స్థానిక ఈడిగ హాస్టల్ నుండి రాయల్ సర్కిల్ వరకు బీజేపీకి చెందిన నాయకులు, మహిళలు. రైతులతో పెద్ద ఎత్తున ర్యాలీ చేసి నిరసన వ్యక్తపరిచారు. సీఎం సిద్దరామయ్య, డీకేశివకుమార్ చిత్రపటాలను గాడిదలపై ఊరేగించి రాయల్ సర్కిల్లో ధర్నా చేశారు. బీజేపీ కార్యకర్తలు ద్విచక్రవాహనాల శవయాత్ర నిర్వహించారు. నగరంలో ఎద్దుల బండ్ల ద్వారా పెద్దఎత్తున నిరసన తెలిపి రాయల్ సర్కిల్ కూడలిలో పెద్దఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల నుండి రైతులు కూడా తరలివచ్చి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తదనంతరం ద్విచక్రవాహనాన్ని దహనం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని మనవిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సీయం సిద్దరామయ్య నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఐదు హామీలు కొనసాగించి పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచిందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ సోమలింగప్ప, బీజేపీ యువజన విభాగం అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు హరినాథరెడ్డి, కార్పొరేషన్ సభ్యులు శ్రీనివాస మోత్కూరు, హనుమంతు, సురేఖ, మల్లన్నగౌడ, సుగుణ, సుమారెడ్డి, రామలింగప్ప, రామాంజిని, మల్లన్నగౌడ, డాక్టర్ మహిపాల్, విరుపాక్షిగౌడ, హగరి స్వామి, మల్లేష్‌తో పాటు బళ్లారి జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఎడ్లబండిపై ధర్నాకు వస్తున్న బీజేపీ నాయకులు



గాడిదలను ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు



ద్విచక్రవాహనానికి శవయాత్ర చేస్తున్న దృశ్యం

ఎల్‌కేజీ బోధన అంగన్‌వాడీలకే అప్పగించాలి

అంగన్‌వాడీల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి

సిరుగుప్ప, జూన్ 18 : ఎల్‌కేజీ బోధనను అంగన్‌వాడీలకు అప్పగించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి డిమాండ్ చేశారు. ఇతరులకు ఆ బాధ్యత కల్పించడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణంలో మంగళవారం సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లను వినిపిస్తూ హైస్కూలు మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ విశ్వనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కంప్లి, జూన్ 18 : నాలుగు సంవత్సరాలు నిండిన పిల్లలకు అంగన్‌వాడీలోనే శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కంప్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ప్రభుత్వం ఉన్నపళంగా ప్రాథమిక పాఠశాలలలోనే ఎల్‌కేజీ, యుకేజీ క్లాసులు ప్రారంభించడంతో తమకు ఇబ్బందిగా మారిందన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గృహలక్ష్మి పథకానికి మొండిచేయి

సిరుగుప్ప, జూన్ 18 : ఈ నెల గృహలక్ష్మి, అన్నభాగ్య పథకం, గ్యారెంటీ పథకాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఐదు గ్యారెంటీ పథకాలు ఐదేళ్ల పాటు అమలులో వుంటాయని హామీ ఇచ్చారని, లోక్‌సభ ఎన్నికల అనంతరం బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు కేవలం బూటకమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్ ఈ నెలాఖరులోపుగా గృహలక్ష్మి బ్యాంకు ఖాతాలకు డబ్బు జమవుతుందని తెలిపారు.

నగరంలో రేపు వైద్య శిబిరం

బళ్లారి సిటీ, జూన్ 18: నగరంలోని జేడీఎస్ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాయణ్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో గుండె, కంటిసమస్యలు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, క్యాన్సర్ తదితర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, తగిన ఔషధాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం బెంగళూరు వైదేహి ఆస్పత్రిలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని భార్యాభర్తల దుర్మరణం

సిరుగుప్ప, జూన్ 18 : బళ్లారి రూరల్ పరిధిలోని కక్కబేవనహళ్లి గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం టిప్పర్ ఢీకొని ఓ భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుడితిని సమీపంలోని హొసదరోజీకి చెందిన నాగరాజు (45) అతని భార్య పార్వతి (38)లు, కుమారుడు రాకేష్ (7)తో కలిసి మంగళవారం అనంతపురంజిల్లా విడపనకల్లు గ్రామంలోని సుంకులమ్మ దర్శనానికి వెళ్లారు. దేవాలయంలో పూజలు నిర్వహించుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా కక్కబేవనహళ్లి గ్రామంవద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ వారి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడు రాకేష్ గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే సమాచారాన్ని బళ్లారి పోలీసులకు అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను, గాయపడ్డ బాలుడిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఎనిమిది గొర్రెల మృతి

కంప్లి, జూన్ 18 : తాలుకా పరిధిలోని చిక్కజాగనూరు, హిరేజాగనూరు గ్రామాల మధ్య అడవుల్లో గొర్రెల కాపరులకు చెందిన ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. బెల్గామ్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు సోమవారం సాయంత్రం మేత మేపుకుని పొలంలోకి వచ్చారు. ఉన్నపళంగా మల్లప్పకు చెందిన నాలుగు గొర్రెలు, శివప్పకు చెందిన మూడు, వీరేష్‌కు చెందిన ఒక గొర్రె మృతి చెందాయి.

అల్లం సుమంగళమ్మ కళాశాలలో యోగా శిబిరం



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాత్యాయిని మరిదేవయ్య

బళ్లారి సిటీ, జూన్ 18: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీమతి అల్లం సుమంగళమ్మ స్మారక మహిళా కళాశాల, పతంజలి కమిటీ ఆధ్వర్యంలో 18 నుంచి 21వరకు యోగా శిక్షణ శిబిర కార్యక్రమాన్ని అల్లం సుమంగళమ్మ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల పాలక మండలి అధ్యక్షురాలు కాత్యాయిని మరిదేవయ్య ప్రారంభించి యోగా కేవలం శిక్షణకే పరిమితం కాకూడదన్నారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో దీనిని అవర్చుకోవాలని సూచించారు. యోగావల్ల ఏకాగ్రత ఆలోచనా శక్తి పెరుగుతాయన్నారు. బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పంపాపతి ఇన్వీ, ప్రకాశ్‌రెడ్డి, జయంతి కలకర్ణి, పుష్పా భూపాల్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కాళమ్మ, దూపం సతీశ్, ఉపాధ్యాయ సిబ్బంది, 90 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

నాటు తుపాకులను స్వచ్ఛందంగా అప్పగించాలి



నాటు తుపాకులపై అవగాహన కోసం నిర్వహిస్తున్న ద్విచక్రవాహన ర్యాలీ

హోసూరు, జూన్ 18: నాటు తుపాకులు కల్గినవారు స్వచ్ఛందంగా అప్పగించాలని అటవీశాఖ కోరింది. ఈమేరకు హోసూరులో అనుమతి లేకుండా కల్గిన ఆయుధాలను అప్పగించాలని కోరుతూ అటవీశాఖ నేతృత్వంలో ద్విచక్ర వాహన అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తిగిరిలోని అటవీ కార్యాలయం వద్ద అటవీశాఖ అధికారి కార్తికేయని ద్విచక్రవాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. 50 మందికి పైగా అటవీశాఖ సిబ్బంది ప్రధాన రహదారుల గుండా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. నాటు తుపాకులు కల్గినవారు వాటిని స్వచ్ఛందంగా అప్పగిస్తే, వారిపై ఎటువంటి చర్యలు ఉండవన్నారు. వ్యవసాయ భూములకు రక్షణగా విద్యుత్ కంచెలు వేయడం చట్ట ప్రకారం నేరమని, వేటకు ఉపయోగించే పరికరాలు, పేలుడు పదార్థాలతో సహా వన్యప్రాణులకు ఇబ్బందులు కలగచేయరాదన్నారు. అవగాహనా కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అటవీశాఖ అధికారి కార్తీకేయని విలేకరులతో మాట్లాడుతూ.. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు ఫారెస్ట్ రిజర్వ్ దాదాపు 1500 చదరపు కిల్లోమీటర్ల విస్తీర్ణంగల పెద్ద అటవీ ప్రాంతమన్నారు. ఇది కావేరి ఉత్తర దక్షిణ వన్యప్రాణుల అభయారణ్యాలను కలిగి ఉందన్నారు. ఇక్కడి ఏనుగుల రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ నాటుతుపాకులు కల్గినవారు స్వచ్ఛందంగా వాటిని ప్రభుత్వానికి అప్పగించాలని కోరుతున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ మ్యాచ్

హోసూరు, జూన్ 18: కృష్ణగిరి జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ టోర్నమెంట్ అదియమాన్ కళాశాల మైదానంలో జరిగింది. న్యాయవాదుల శారీరక, మానసిక ఆరోగ్యం బాగుండాలని, జిల్లా న్యాయవాదుల ఐక్యత, సౌభ్రాతృత్వం కోసం పోటీలు నిర్వహించారు. హెచ్‌పీఏ - ప్రీమియర్ లీగ్ పేరుతో జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా మున్సిఫ్ కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అకావితన్ ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ప్రదానం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి శక్తి నారాయణన్, డెంకణీకోటై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మలర్వణ్ణన్, పోచ్చంపల్లి, ఊత్తంగర్రై, హోసూరు శివన్న చౌదరి, సత్యనారాయణన్, జీవానందం, మునియాండి, శివశంకర్, చిన్నపిల్లప్ప, రాంప్రకాశ్, హోసూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు. విజేతలకు హోసూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనంద కుమార్, పోటీ అధ్యక్షుడు శివన్న చౌదరి పతకాలు, సర్టిఫికెట్లు, ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ న్యాయవాది చిన్నపిల్లప్ప ట్రోఫీలను నగదు బహుమతులు అందజేశారు.



విజేతకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న దృశ్యం

'రాయచూరు నగరసభ సమావేశం నిర్వహించాలి'

రాయచూరు, జూన్ 18 : నగరంలో అనేక వార్డుల్లో సమస్యలు పేరుకుపోతున్నా వాటికి పరిష్కారం లభించడం లేదని ఈ క్రమంలో వెంటనే నగరసభ సాధారణ సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించేలా చర్యలు తీసుకోవాలని నగరసభ సభ్యులు కోరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ సభ్యుడు జయణ్ణ నేతృత్వంలోని ఆ పార్టీ నగరసభ సభ్యులు మంగళవారం జిల్లాధికారిని కలిసి ఈ మేరకువినతి పత్రం ఇచ్చారు. పలు వార్డుల్లో సమస్యలు పేరుకుపోతున్న విషయం అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించడం లేదన్నారు. నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాల కోసం ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాయిదావేస్తూ ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికైన నగరసభ సభ్యులు నామమాత్రంగా మిగిలారన్నారు. ఏడాది కాలంగా నగరసభ సాధారణ సమావేశం జరగనే లేదని దీంతో ప్రజలు అనేక సమస్యల పరిష్కారం కోసం నగరసభ సభ్యులను ఒత్తిడికి గురి చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో సాధారణ సమావేశం నిర్వహించాలని కోరారు.

వ్యవసాయ మంత్రి పదవి నుంచి తప్పుకోవాలి

●సర్వోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్



విలేకరులతో మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్, ఇతర పార్టీ నేతలు

రాయచూరు, జూన్ 18: వ్యవసాయ శాఖలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నా స్పందించని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి బాధ్యతల నుంచి తప్పుకోవాలని ప్రముఖ రైతు సంఘం నాయకుడు, సర్వోదయ కర్ణాటక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారంఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వ్యవసాయ శాఖలో జరుగుతున్న పలు అవినీతి వ్యవహారాలకు సంబంధించి మంత్రికి బాధితులు, రైతు సంఘాల నుంచి లిఖితపూర్వకంగా మౌఖికంగా ఫిర్యాదులందినా ఇప్పటి వరకు వాటిపై స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఇలాంటి తరుణంలో పదవి నుంచి తప్పుకోవడం ఉత్తమమన్నారు. కాగా వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.147 కోట్ల అవినీతి జరిగిన విషయం తనకు తెలియదంటూ మండలి ఛైర్మన్ హోదాలో రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ వ్యాఖ్యలు చేయడం హాస్యస్పదమన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్న ఆయనకు తన కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి గురించి తెలియదనుకోవడం అవివేకమన్నారు. కాగా రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రాహుల్‌గాంధీ (పుట్టినరోజు)



రాహుల్‌గాంధీ 1970 జూన్ 19న ఢిల్లీలో జన్మించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాజీ చైర్‌పర్సన్ సోనియాగాంధీల కుమారుడు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా 2017 నుంచి 2019 వరకు కొనసాగారు. అంతకుముందు అమేథీ నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీ అ య్యారు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, రాజీవ్‌గాంధీ చారిట బుల్ ట్రస్టు సభ్యుడు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదా లలో కొనసాగారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయ బరేలినుంచి లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందారు.

సల్మాన్ రష్దీ (పుట్టినరోజు)



సర్ అహ్మద్ సల్మాన్ రష్దీ 1947 జూన్ 19న జన్మించారు. భారత సంతతికి చెందిన బ్రిటీష్ నవలా రచయిత. ఆయన రచనలు ఐదుసార్లు బుకర్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యాయి. 1981లో 'మిడ్‌నైట్స్ చిల్డ్రన్' రచన బుకర్ ప్రైజ్ దక్కించుకుంది. 1983లో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌లో గుర్తింపు పొందారు. 2008లో టైమ్స్ ర్యాంకుల జాబితాలో గ్రేటెస్ట్ బ్రిటీష్ రైటర్స్ 50మందిలో 13వ స్థానం దక్కించుకున్నారు. అన్ని తరాల ఆంగ్లో-ఇండియన్ రచయితలను ప్రభా వితం చేశారనడంలో అతిశయోక్తి లేదు. టైమ్ 2023 ఏప్రిల్‌లో ప్రచురించిన వందమంది ప్రముఖ ప్రభా వితుల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

అంగ్‌సాన్ సూకీ (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత అంగ్‌సాన్ సూకీ 1945 జూన్ 19న యాంగోన్ (రంగూన్)లో జన్మించారు. బర్మాకు చెందిన రాజకీయ నేత, రచయిత్రి. మయన్మార్ కౌన్సెలర్ (ప్రధాన మంత్రి సమాన హోదా)గా వ్యవహరించారు. 2016-21 మధ్య విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీకి 2011 నుంచి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. 1988 నుంచి 2011వరకు జనరల్ సెక్రటరీగా వ్యవహరించారు. పలు గౌరవ పుర స్కారాలు అందుకున్నారు.

జంధ్యాల (వర్ధంతి)



సినీ రంగంలో హాస్యబ్రహ్మగా పేరొందిన 'జంధ్యాల' వీర వెంకటదుర్గా శివసుబ్రమణ్య శాస్త్రి 1951 జనవరి 14న నరసాపురంలో జన్మించారు. ఇంటి పేరుతోనే గుర్తింపు పొందారు. తెలుగు సినీ రంగంలో స్క్రీన్ రైటర్‌గా, దర్శకుడిగా, నటుడిగా తనదైన ముద్రవేశారు. పాతికేళ్ల సినీ జీవితంలో 4 నంది అవార్డులు, ఫిల్మ్ ఫేర్‌లు అందుకున్నారు. శంకరాభరణం, సప్తపది, సీతా కోకచిలుక, సాగరసంగమం, స్వాతికిరణం వంటి సిని మాలకు ఆయనే మాటలు రాశారు. హాస్యానికి ట్రెండ్ సృష్టించారు. 'ఆపద్బాంధవుడు'కు ఉత్తమ మాట ల రచయితగా నంది అవార్డు అందుకున్నారు. బ్రహ్మానందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తివేలు తదితర నటులను ఆయనే పరిచయం చేశారు. 2001 జూన్ 19న గుండెపోటుతో కన్నుమూశారు.

సమయానికి రాని బస్సులు.. ప్రయాణికుల నిరసన

దొడ్డబళ్ళాపుర, జూన్ 18: కేఎస్‌ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంపై పాత బస్టాండ్ వద్ద ప్రయాణికులు మంగళవారం నిరసన తెలిపారు. నిత్యం పట్టణం నుంచి బెంగళూరుకు దైనందిన కార్యక్రమాలకు వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే సమయానికి బస్సులు రాకపోవడంపై ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. సుదీర్ఘకాలం వేచియున్న కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు నిరసన తెలిపారు. నిర్ణీత సమయానికి బస్సులు రాకపోవడంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. గంటలతరబడి వేచియున్నా బస్సులు రాలేదన్నారు. అపురూపంగా ఎప్పుడో ఒక బస్సు రావడంతో ఒకరినొకరు తోసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కనీసంగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. నెలవారీ, వార్షిక బస్‌పాసులు ఉన్నా సమయానికి బస్సులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి ప్రయాణీకులకు నచ్చచెప్పారు.



బస్టాండ్‌లో పెద్దసంఖ్యలో గుమిగూడిన ప్రయాణికులు

విద్యతోనే ప్రగతి సాధ్యం



పాతశాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ

శిడ్లఘట్ట, జూన్ 18: విద్యారంగంలో శిడ్లఘట్ట తాలూకా మరింత పురోగతి సాధించాలని, సమాజంలో విద్యతోనే ప్రగతి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పటేల్ వీధిలో నగరసభ సభ్యుడు అఫ్సర్‌పాషా నూతనంగా ప్రారంభించిన లండన్‌కిడ్స్ యూకే తరహాలో ఇంటర్నేషనల్ ప్రీస్కూల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నగరసభ సభ్యుడు అఫ్సర్‌పాషా ఈ ప్రాంతం ప్రజలకు గుణాత్మక విద్యను అందించేలా స్కూల్ ఏర్పాటు చేయడంపై అభినందించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, పేద విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపట్ల దృష్టి సారించాలన్నారు.

ఎండో క్రైనాలజీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు

» సేద తీరేందుకు 16 బెంచీలు ప్రారంభం

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎండోక్రైనాలజీ ఆసుపత్రికి వచ్చే రోగులు, బంధువులు సేదతీరేందుకోసం ప్రత్యేకంగా బెంచీలను ఉత్తిష్ఠ ఎన్జీఓ సంస్థ ఏర్పాటు చేసింది. మంగళవారం సంస్థ చీఫ్ ఇన్నర్వేషన్ ఆఫీసర్ క్రిస్టోఫ్ నికొలస్ బెంచీలను లాంఛనంగా ప్రారంభించారు. ఎండోక్రైనాలజీ ఇన్‌స్టిట్యూట్ ముఖ్యులు డాక్టర్ సంతోష్ భాగస్వాములయ్యారు. సివి రామన్‌నగర్‌లో ఉండే ఆసుపత్రికి వివిధ ప్రాంతాలనుంచి ఎండోక్రైనాలజీలో వైద్యం పొందేందుకు నిత్యం ఎంతోమంది వస్తుంటారు. వారికి వీలుగా ఆసుపత్రి ప్రాంగణంలో రాతితో రూపొందించిన బెంచీలను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా ఐదుగురు టైప్1 డయాబెటిక్ చిన్నారులకు వైద్యఖర్చులు భరించనున్నట్టు ప్రకటించారు. ఉత్తిష్ఠ సంస్థ విద్య, పర్యావరణం కోసం పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల పాఠశాలలకు డిజిటల్ విద్య అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, గ్రామీణ పాఠశాలలకు తాగునీరు కల్పించడం వంటి సేవలు కొనసాగిస్తోంది.



బెంచీలను ప్రారంభిస్తున్న క్రిస్టోఫ్ నికొలస్



మీడియా సమావేశంలో ఆసుపత్రి ముఖ్యులు

రెయిన్‌బో ఆసుపత్రికి జేఎస్‌ఐ గుర్తింపు

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా పనిచేసే రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు బర్త్‌రైట్‌కు గాను జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నుంచి గోల్డ్‌సీల్ ఆఫ్ క్వాలిటీ అప్రూవల్ లభించింది. మారతహళ్లిలోని ఆసుపత్రిలో నిర్వహణ, చికిత్సా విధానం, పసికందుల ఆరోగ్యరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు ఆసుపత్రి ఎండీ రమేశ్ కంచెర్ల తెలిపారు. 14 విభాగాలలో 1200కుపైగా పరిశీలనలు జరిపారు. ఆరోగ్య సేవలలో ఉత్తమంగా ఉన్నమేరకు జేఎస్‌ఐ గుర్తింపు సాధ్యమైందన్నారు. పసికందుల ఆరోగ్యం మా లక్ష్యమని, ఆరంభం నుంచి ఒకే విధానం కొనసాగిస్తున్నామన్నారు. నిష్ణాతులైన గైనకాలజిస్ట్‌లు, చిన్నపిల్లల వైద్యులు నిరంతరంగా అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారన్నారు. సంస్థ వైస్‌ప్రెసిడెంట్ నిత్యానంద మాట్లాడుతూ ఉన్నతమైన క్లినికల్ విధానాలతోనే మంచిపేరు సాధ్యమైందన్నారు. సీనియర్ కన్సల్టెంట్ రక్షయ్‌శెట్టి మాట్లాడుతూ నిరంతరం గుణాత్మకమైన ఆరోగ్య సేవలకుగాను గుర్తింపు దక్కిందన్నారు. రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నట్టు తెలిపారు.

రోడ్డును బాగు చేయండి

దొమ్మసంద్ర, జూన్ 18: ఆనేకల్ తాలూకాలోని దొమ్మసంద్ర గ్రామంలో స్థానిక సర్జాపుర - బెంగళూరు రోడ్డు మార్గంలో ముత్తనల్లూరు క్రాస్ వద్ద రోడ్డు దుస్థితిగా మారింది. రెండు మూడు అడుగుల మేర గుంతలు ఏర్పడ్డంతో వాహనాల సంచారానికి అంతరాయం ఏర్పడింది. ఈమేరకు పిడబ్ల్యుడి అధికారి చంద్రశేఖర్ దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందని వాహనచోదకులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. పన్నులరూపంలో భారీగా వసూలు చేస్తున్నప్పటికీ కనీసంగా రవాణాకు సరైన సదుపాయం లేకపోవడంపై మండిపడుతున్నారు. వెంటనే రోడ్డుబాగు చేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



గుంతలమయమైన రహదారి ఇలా...

లగేజీలో ఏముందని ప్రశ్నిస్తే... బాంబులు ఉన్నాయన్న వృద్ధుడు

» కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి దుబాయ్‌కు వెళ్తున్న వృద్ధుడిని ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ లగేజ్‌బ్యాగ్‌లో ఏం ఉందని ప్రశ్నిస్తే విసుగుతో బాంబ్‌లు ఉన్నాయన్నాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది విమానంలో ప్రవేశించేందుకు అవకాశం లేదు. బెంగళూరు అంజనాపుర నివాసి 81ఏళ్ల సి కృష్ణరాజ్ ఎమిరేట్స్ ఇకె 565విమానంలో దుబాయ్‌కు వెళ్లేందుకు సోమవారం ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. 10.30 గంటలకు విమానం టేకాఫ్ కావాల్సి ఉండగా 8 గంటలకే లగేజ్ చెక్ ఇన్‌పాయింట్‌కు చేరుకున్నారు. బ్యాగేజ్‌ను డ్రాప్ కౌంటర్‌లో ఉన్న ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ బ్యాగులో ఏం ఉందని ప్రశ్నించారు. కృష్ణమూర్తి విసుగ్గా బాంబులు ఉన్నాయంటూ వ్యంగ్యం చేశారు. తోటి ప్రయాణీకులు భయపడ్డారు. ఎగ్జిక్యూటివ్ వెంటనే అప్రమత్తమై సీఐఎస్ఎఫ్ బలగాలకు సమాచారం ఇచ్చారు. దీంతో వృద్ధుడిని అదుపులోకి తీసుకుని సమగ్రంగా లగేజ్‌ను పరిశీలించారు. అతడి వద్ద బాంబులు లేకున్నా విమానంలో ప్రయాణించేందుకు అవకాశం కల్పించలేదు. ఈ మేరకు ఐపీసీ 505 (1)(బి) సెక్షన్ ప్రకారం ప్రజలు భయపడేలా వ్యవహరించడం, వ్యాఖ్యానించడం నేరంగా పరిగణిస్తూ కేసు నమోదు చేసినట్టు ఎమిరేట్స్ ఎయిర్ సర్వీసెస్ అధికారి నిరుపమ తెలిపారు.

సన్నీలియోన్‌ను చూసేందుకు ఎగబడ్డ జనం



అవుట్‌లెట్ ప్రారంభంలో నటి సన్నీలియోన్

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో బ్యూటీ అండ్ ఎక్స్‌పీరియెన్స్ అవుట్‌లెట్‌ను ప్రారంభించేందుకు వచ్చిన నటి సన్నీలియోన్‌ను చూసేందుకు జనం ఎగబడ్డారు. మంగళవారం హెచ్‌ఆర్‌బీఆర్ లేఅవుట్‌లో నేచురల్స్ ఫౌండర్ వీణా, కో ఫౌండర్ కుమార్‌వెల్ తదితరులు ముఖ్యులుగా పాల్గొన్నారు. అవుట్‌లెట్ వద్దకు సన్నీలియోన్ చేరుకోగానే పెద్ద ఎత్తున ప్రజలు గుమిగూడారు. అనంతరం అవుట్‌లెట్‌ను ప్రారంభించిన తర్వాత సన్నీలియోన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యం, అందకోసం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రకృతిలో సహజ సిద్ధమైన ఉత్పత్తులను వాడాలన్నారు.

రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్18: ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్యఎన్జీ రంగా వ్యవసాయ పరిశోదన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. పలు చోట్ల 1.0- 2.0 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉంద న్నారు. నైరుతి దిశగా గంటకు 6.0 కి.మీ వేగంతో గాలులు వీస్తాయన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వర్షాధారంగా వేసే రైతులు అంతర పంటలు సాగు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోదన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి సూచించారు. ప్రస్తుతం తేలిక పాటి నేలలో నేలను వాలుకు అడ్డంగా దున్ని పంటలను విత్తుకోవాలన్నారు. అరుతడి పంటలను బోదే , సాళ్ల పద్ధతి లేదా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకోవాలన్నారు. తద్వారా పంటకు ఎక్కువ కాలం తేమ లభ్యమవుతుంది. పొలం గట్టుపైన కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టడానికి ప్రధాన పంటలైన వరి, మొక్క జొన్న , జొన్న, పెసర , కంది వేరుశనగ విత్తనాలను తెగళ్ల మందులతో విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఇంటర్ సప్లీ పరీక్షల్లో 60.69 శాతం ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 18 : ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 60.69 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,811 మంది పరీక్షలకు హాజరు కాగా 2,920 మంది పాస్ అయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 1033 మందిలో 658 మంది, ఎయిడెడ్‌లో 353 మందిలో 170 మంది, వెల్ఫేర్‌లో 113 మందిలో 76 మంది, కేజీబీవీల్లో 125 మందిలో 93 మంది, మోడల్ స్కూళ్లలో 262 మందిలో 179మంది, ప్రైవేట్‌లో 2,925 మంది విద్యార్థుల్లో 1744 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని స్పష్టం చేశారు. జిల్లాలో ఆత్మకూరు జూనియర్ కాలేజీ, కణేకల్లు జూనియర్ కళాశాలలు మరో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, రెండు కేజీబీవీలు, రెండు, మోడల్ స్కూళ్లలో 100 శాతం రిజల్ట్స్ వచ్చినట్లు తెలిపారు.

కోమటికుంట్లలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

పుట్లూరు, జూన్ 18: మండలంలోని కోమటికుంట్లలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు సోమవారం రాత్రి వైసీపీ నాయకులు కవ్వింపు చర్యల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ గొడవలో టీడీపీకి చెందిన చంద్ర, సి. శ్రీనివాసులునాయుడు, పి. శ్రీనివాసులునాయుడు, వైసీపీకి చెందిన ఎరుకలయ్య గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీకి చెందిన 8మంది, వైసీపీకి చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి పరిశీలించారు. ముందస్తుగా కోమటికుంట్ల గ్రామంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

అనంతపురం టౌన్, జూన్ 18: జిల్లాలో మలేరియా, డెంగీ ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కావడంతో దోమలు ప్రబలే ప్రమాదం ఉందని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రతంగా ఉండేలా చూడాలని సూచించారు. అన్ని వసతి గృహాలలో మలేరియా సిబ్బంది సహకారంతో ఐఆర్ఎస్ పిచికారీ చేయించాలని ఆదేశించారు. పంచాయతీలలో చెత్త తొలగించాలని, మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని తాగునీటి ట్యాంకులను క్లోరినేట్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. లార్వాను తినే చేప పిల్లల ఉత్పత్తి, ఎక్కడ వదులుతున్నారో వివరాలను పంపాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ బాధితులకు చికిత్స అందించేందుకు ఆస్పత్రులలో వసతులు ఏర్పాటు చేసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

బడికి పంపండి..

చదువుకుంటేనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో 'బడికి పంపుదాం' కార్యక్రమ పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించి ఉచితంగా చదువు చెప్పిస్తుందని అన్నారు. చదువు లేకపోతే ఎంత సంపద ఉన్నా వ్యర్థమని అన్నారు. ప్రతి చిన్నారినీ బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009లో తీసుకొచ్చారని, ఆ చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత విద్యను తప్పనిసరిగా అందించాల్సి ఉంటుందని అన్నారు. ఆ వయసు చిన్నారులు ఎవరూ బడిబయట ఉండకూడదని, అందరినీ బడిలో చేర్పించి చదువు నేర్పించాలని అధికారులను ఆదేశించారు.

కన్నీటిధార..!

నష్టాల పంట ఖరీఫ్, రబీలో పెట్టుబడి మట్టిపాలు
కర్ణాటక రాష్ట్రానికి వలసబాట
ఐదేళ్లలో పెరిగిన అన్నదాత ఆత్మహత్యలు
వ్యవసాయానికి విపత్తు
నేడు కేంద్ర కరువు బృందం పర్యటన

పుట్టపర్తి, జూన్18(ఆంధ్రజ్యోతి): కరువు రైతు ఏటా అప్పుల సేద్యం చేస్తున్నాడు. నష్టాల పంట పండిస్తున్నాడు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. వాటిని తీర్చే మార్గంలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుంటున్నారు. మరికొందరు భార్యా బిడ్డలతో పరాయి రాష్ట్రాలకు పొట్ట చేతపట్టుకుని వలస వెళ్తున్నారు. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో పంటలు చేతికిరాకపోగా.. రబీ అప్పుల ఊబిలోకి నెట్టింది. ఐదేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో వరుసగా పంటలు చేతికిరాక రైతన్నలకు పెట్టుబడులు కూడా దక్కట్లేదు. అప్పులు మూటగట్టుకున్నారు. భూమినే నమ్ముకున్న రైతు జీవనం భారంగా మారింది. వరుస కరువులతో రైతు కుటుంబాలతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన పల్లె, పట్నం జనం వలసలు కట్టారు. ఈ పరిస్థితులు జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతన్నను ఆందోళనలోకి నెట్టేస్తోంది. జిల్లాలో ఏటా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.23 లక్షల హెక్టార్లు. గతేడాది ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచే వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటల సాగు చతికిలపడింది. పంటలు పూర్తిగా ఎండిపోయి, అన్నదాతలు సర్వం నష్టపోయారు. అయినా.. అప్పోసొప్పో చేసి రబీలో పంటలు పెట్టారు. తీరా చేతికొచ్చే సమయానికి తడిలేక పలు పంటలు ఎండిపోయి, పొలంలోనే వదిలేసే పరిస్థితులు దాపురించాయి. కూలీల ఖర్చులు కూడా దక్కక రైతన్న పెట్టుబడి మట్టిపాలైంది. రబీలో జిల్లా అంతటా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా.. ప్రభుత్వం ఒకే మండలంలో తీవ్ర కరువు అని ప్రకటించి, 31 మండలాలకు మొండిచేయి చూపింది. ఈనేపథ్యంలో వరుసగా ఖరీఫ్, రబీలో రుణభారం కూడగట్టుకున్న రైతన్న ఉపాధి కోసం వలస బాటపట్టారు. జిల్లాలో కరువును పరిశీలించేందుకు బుధవారం కేంద్ర బృందం వస్తోంది. కరువు రైతుపై ఏమేరకు కనికరం చూపుతారోనన్న చర్చ సాగుతోంది. జిల్లాలో వర్షాధారంగా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడి అన్ని మండలాల్లో వర్షాధార వేరుశనగ తదితర అన్ని పంటలు ఎండిపోయాయి. అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చాలాచోట్ల పశుగ్రాసం సైతం దక్కలేదు. వేల కోట్ల రూపాయల రైతు పెట్టుబడి మట్టిలో కలిసిపోయింది. గత ఖరీఫ్‌లో జిల్లాలో ఏడు తీవ్ర, 14 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించింది. 11 మండలాలకు మొండిచేయి చూపింది. జిల్లాలో 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఐదేళ్లుగా పంటల పండక రుణభారం పెరిగిపోయి, పలువురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం రైతున్నను వెంటాడగా.. రబీలోనైనా రుణభారం నుంచి గట్టెక్కుతామని భావించిన అన్నదాతకు నిరాశే ఎదురైంది. ఈశాన్య రుతుపవనాలు బలహీన పడడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. భూగర్భజలమట్టం పడిపోయి, బోరుబావులు వట్టిపోయి, పంటలు ఎండిపోయాయి. దీంతో రైతన్నకు మళ్లీ అప్పులే మిగిలాయి. జిల్లావ్యాప్తంగా రబీలో 28,192 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయగా.. వర్షాభావంతో అన్ని చోట్లా దెబ్బతిన్నాయి. చాలాచోట్ల చేతికొచ్చే సమయంలో నష్టపోయారు. 2023-24లో రబీ సీజన్‌లో జిల్లా అంతటా కరువుఛాయలు అలముకున్నా.. రొద్దం మండలాన్ని మాత్రమే తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించారు. అది కూడా పప్పుశనగ పంట మాత్రమే దెబ్బతిన్నట్లు వైసీపీ ప్రభుత్వం ప్రకటించి, అన్నదాతకు తీవ్ర అన్యాయం చేసింది.



ఖరీఫ్‌లో నంబులపూలకుంట మండలంలో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్)

నేడు కేంద్ర కరువు బృందం పర్యటన

జిల్లాలో 2023-24 రబీ సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అందుకునేందుకు జిల్లాలో కేంద్ర కరువు బృందం బుధవారం జిల్లాకు రానుంది. రొద్దం మండలం ఆర్ కొట్టాలలో పర్యటించనుంది. ఆర్ కొట్టాల, చెరుకూరు పప్పుశనగ రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననుంది. కేంద్ర కరువు బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పప్పుశనగ పంట లేదు. దీంతో జిల్లా అధికార యంత్రాగం.. ప్రభుత్వానికి పంపిన నివేదికపై కరువు బృందం అధ్యయనం చేసి, రైతుల ద్వారా కరువు పరిస్థితులను తెలుసుకోనుంది.

వెంటాడుతున్న కరువు

జిల్లాలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 3.23 లక్షల హెక్టార్లు కాగా.. గతేడాది 1,14,076 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2,05,601 హెక్టార్లకుగాను 64,978 హెక్టార్లలో మాత్రమే పంట పెట్టడం గమనార్హం. మిగతా పంటలదీ అదే పరిస్థితి. అరకొర పదునులో అప్పోసొప్పో చేసి రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టి రైతన్న విత్తనం వేశాడు. తీరా పంటచేతికొచ్చే సమయానికి వరుణదేవుడు కరుణించలేదు. ఫలితంగా పంటలు ఎండిపోయి, పొలంలోనే వదిలేసే పరిస్థితులు దాపురించాయి. కనీసం కూలీ ఖర్చులు కూడా రాలేదు. జిల్లా అంతటా తీవ్రంగా నష్టపోతే గతేడాది డిసెంబర్‌లో పర్యటించిన కేంద్ర కరువు బృందం కేవలం 73,566 హెక్టార్లలో వేరుశనగ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలిచ్చింది. ఆ మేరకు కంటితుడుపుగా పరిహారం ఇచ్చారు. జిల్లాలో 32 మండలాల్లో ఖరీఫ్‌లో వర్షధారంగా సాగుచేసిన పంటలు 90 శాతంపైగా చేతికిరాలేదని యంత్రాంగం.. ప్రభుత్వానికి నివేదిక పంపింది. రూ.500 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.105.03 కోట్లు మాత్రం పరిహారం విడుదల చేసింది. అదికూడా చాలామంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. రబీలో జిల్లావ్యాప్తంగా వివిధ పంటలు సాగు చేశారు. రొద్దం మండలంలో 503 మంది 656.92 హెక్టార్లలో సాగుచేసిన పప్పుశనగ పంట మాత్రమే దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. రూ.65.60 లక్షలు పరిహారం అందించాలని అందులో ప్రతిపాదించడం శోచనీయం. మిగతా మండలాల్లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. వరుసగా రెండేళ్లపాటు రైతన్నను కరువు వెంటాడడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో మడకశిర, కదిరి, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం రైతులు, రైతుకూలీ లు కర్ణాటక రాష్ట్రానికి వలసలు కట్టారు. ఇలా లక్షల మంది పొరుగు రాష్ట్రానికి పరుగులు పెడుతున్నారు. కరువు నివారణ దిశగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కూడా సక్రమంగా అమలుకావట్లేదన్న విమర్శలున్నాయి. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా రైతుకు వలస తప్పట్లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవడంతో జిల్లాలో వ్యవసాయానికే విపత్తు ఏర్పడింది. గత ఖరీఫ్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో ప్రత్యేకించి చేపట్టిన పనులు, నిధుల విడుదల ఎక్కడా కన్పించలేదు.

